క్లుప్తంగా

కథల సంపుటి అందజేత



జీఎంకు పుస్తకం అందజేస్తున్న రంగనాథ్

ఇల్లెందు: టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మాజీ సింగరేణి ఉద్యోగి, ఇల్లెందు వాసీ ఎస్.రంగనాథ్ తాను రాసిన 'ప్రాణం తీసిన పైసలు' కథల సంపుటిని ఏరియా జీఎం వీసం కృష్ణయ్యకు అందజేశారు. మంగళవారం జీఎం చాంబర్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జీఎం.. సింగరేణిలో పని చేస్తూ కథల సంపుటిని ప్రజల ముంగిటకు తీసుకొచ్చిన రచయిత రంగనాథ్‌ను అభినందించారు.

రాణించిన మైనార్టీ గురుకులం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హుస్సేన్, ఉపాధ్యాయులు

ఇల్లెందు: తెలంగాణ మైనార్టీ గురుకులం ఇల్లెందు జూనియర్ కళాశాల విద్యార్థి సీఎం కప్‌లో జిల్లా స్థాయిలో రాణించాడు. మంగళవారం ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ మాట్లాడుతూ.. గత 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలో సల్మాన్‌ఖాన్ (ఇంటర్ రెండో సంవత్సరం) పతకం సాధించాడు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పతకం అందకోనున్నట్లు చెప్పారు. అదేవిధంగా మరో నలుగురు ఇతర విభాగాల్లో పతకాలు పొందారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విజేతలను అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సంఘీభావం తెలుపుతున్న గుమ్మడి నర్సయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమగ్రశిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసి సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. నర్సయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాఉద్యమంగా మార్చాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోనెల రమేష్, ఆర్.మధుసూదన్‌రెడ్డి, యాకూబ్ షావలీ, పెద్దబోయిన సతీష్, వేల్పుల రమేష్, కుంజా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో షేరింగ్ డే

పాల్వంచ: పట్టణంలోని త్రివేణి పాఠశాలలో మంగళవారం షేరింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.నేతాజీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తరగతి గదులను ముస్తాబు చేశారు. స్నేహితులకు కానుకలు అందించారు. షేరింగ్ డే శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



కొత్త ఆలోచనలతో ముందుకెళ్దాం..

కాలచక్రం గిర్రున తిరిగింది. 2024వ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. కొంగొత్త ఆలోచనలు.. ఆశయాలు.. ఆశలతో 2025వ సంవత్సరంలోకి ఆనందోత్సవాలతో అడుగుపెట్టేశాం.. మంచి ఆలోచనలతో అడుగులు వేసేలా, జీవితం సాఫీగా ఉండేలా చూడమంటూ అన్నివర్గాల ప్రజలు నూతన సంవత్సరాన్ని సమష్టిగా స్వాగతించారు. ఇంటిముంగిట రంగవల్లులతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. ఏడాదంతా ఆనందమయం కావాలని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని.. మిఠాయిలు పంచారు. ఈ నూతన సంవత్సరంలో ఆశలు, ఆకాంక్షలతో నవ వసంతం.. కావాలి మనందరి సొంతం.. అంటూ ప్రజలు, యువకులు న్యూ ఇయర్ వేడుకలను మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆనందంగా జరుపుకుంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంఅర్బన్: పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



పాల్వంచ: రంగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



సుజాతనగర్: శ్రీవాణి నికేతన్‌లో ముగ్గుల పోటీలు



కొత్తగూడెంటౌన్: గణేష్‌టెంపుల్ రోడ్డుపై రంగుల దుకాణం



కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో..



ఇల్లెందు: బేకరీ షాపు ముందు కేకుల అమ్మకం



సాహితీ జూనియర్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ రాంబాబు, డైరెక్టర్ నాగిరెడ్డి



టేకులపల్లి: బొమ్మనపల్లి పాఠశాలలో..



జూలూరుపాడు: కేక్‌లు కొంటున్న యువకులు



కొత్తగూడెంటౌన్: సూపర్‌బజార్‌లో కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేస్తున స్థానికులు



సుజాతనగర్: రంగులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



జూలూరుపాడులో...

క్యాలెండర్లు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: సమాచార హక్కు చట్టాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 నూతన క్యాలెండర్ 2025ను ఆయన ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం గురించి అందరికీ అవగాహన ఉండాలన్నారు.

పాల్వంచ: తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నూతన సంవత్సర క్యాలెండర్లను మంళవారం యూనియన్ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు ఎంఏ.వజీర్ ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు మరింత ఐకమత్యంగా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పి.రాము, డి.రాధాకృష్ణ, ధనయ్య, కె.సాంబయ్య, నాగమణి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం సందర్శించారు. 2024లో నమోదైన కేసుల రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి ముద్దాయిలకు శిక్షపడేలా కోర్టు సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది పనితీరు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి నిర్వహణపై ఎమ్మెల్యే ఆగ్రహం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం 8వ వార్డులోని మాతాశిశు ఆస్పత్రి నిర్వహణపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులు, వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవటం, ల్యాబ్ మూసివేయటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పేషంట్లతో మాట్లాడి ఆస్పత్రి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ విధుల్లో ఉన్న సిబ్బంది అందుబాటులో లేకపోవడం సరైంది కాదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే, ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సరైన సేవలు అందకపోవటం వల్లే గత ఏడాది 400 కాన్పులకు గాను 150కి పడిపోయిందని, ఈ నిర్లక్ష్యం పేదలకు అన్యాయం చేయడమేనన్నారు. ఆస్పత్రి సమస్యలపై ముఖ్యమంత్రి, వైద్య శాఖ మంత్రికి నివేదిస్తామన్నారు.



పేషంట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

ఉచిత న్యాయ సాయం పొందండి..



రికార్డులను తనిఖీ చేస్తున్న కీర్తిచంద్రికారెడ్డి

ఇల్లెందు: ఆర్థిక స్తోమత లేని ఖైదీలు ప్రభుత్వం కల్పించే ఉచిత న్యాయ సేవా సదుపాయం పొందాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి డి.కీర్తిచంద్రికారెడ్డి తెలిపారు. మంగళవారం ఇల్లెందు సబ్ జైలును అకస్మికంగా తనఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలు పరిశుభ్రత పాటించాలని, పేద ఖైదీలు ఉచితంగా ప్రభుత్వం కల్పించే న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయమూర్తితో పాటు సబ్ జైలు సూపరింటెండెంట్ ఎన్.చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ భుజంగరావు, సబ్ జైలు సిబ్బంది కె.శ్రీనివాస్, శాంతి స్వరూప్, టి.నవీన్, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లెందురూరల్: స్త్రీనిధి ద్వారా మంజూరయ్యే రుణాలను పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం సెర్ప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీఎం దుర్గారావు మాట్లాడుతూ.. మహిళలు తమ వ్యవసాయ క్షేత్రంలో మునగ సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వర్షాకాలం పంట పూర్తయ్యాక మునగ విత్తనాలు చల్లితే తిరిగి వర్షాకాలం నాటికి పెట్టుబడికి అవసరమయ్యే ఆదాయం వస్తుందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు అంతరపంటగా మునగ సాగుకు అవకాశం ఉంటుందన్నారు. పూబెల్లి గ్రామాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు పొదుపు సంఘాల మహిళలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టీజీబీవీ మేనేజర్ కోటయ్య, అన్నపురెడ్డిపల్లి ఏపీఎం మీరాబీ, కృష్ణవేణి, స్వాతి, స్వర్ణలత, నర్సింహారావు, నాగేంద్ర, భూలక్ష్మి, రామ్మూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

పాల్వంచరూరల్: బస్వతారక కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యుడు చరణ్ మాట్లాడుతూ... 1970 డిసెంబర్ 30న కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రంలో అధ్యయనం, పోరాటం నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే లక్ష్యాలతో ఎస్‌ఎఫ్‌ఐ ఏర్పాటై నేటికి 55 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అప్పటి నుంచి విద్యార్థుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలను కొనసాగిస్తోందన్నారు. సుభద్ర, సాయి, శ్రావణ్, మహేందర్, సాయి కుమార్, సమీర్, భవాని, జలజ, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

పాల్వంచ: బీసీ సంక్షేమ శాఖలో ముఖ్య అధికారి సంక్షేమ వసతి గృహాల సమస్యలు పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని బహుజన స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సీహెచ్.నాగరాజు విమర్శించారు. మంగళవారం పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమ శాఖలో క్రీడల పేరుతో, బీసీ కమిషనర్ బృందం పర్యటన పేరుతో వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. డైట్ బిల్లుల పేరుతో ప్రతి విద్యార్థికి రూ.50, ఆడిటింగ్ పేరుతో రూ.20వేలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పేరుతో రికార్డులు తయారు చేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, ప్రవీణ్, కుమార్, అనిల్, శ్రావణ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతీయ అవార్డుకు శ్రీను ఎంపిక

పాల్వంచ: అంబేద్కర్ జాతీయ అవార్డుకు జెన్‌కో ఉద్యోగి దండోర శ్రీను ఎంపికయ్యారు. జనవరి 5న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందజేయనున్నారు. ఈ సందర్భంగా శ్రీనును కొత్తపల్లి సోమయ్య, దాసరి యాకయ్య, సందీప్, మల్లయ్య, వావిలాల తిరుపతి, యుగపతి, సంజీవయ్య, ప్రకాష్, గొర్ల నాగరాజు, కెకె.శ్రీను తదితరులు అభినందించారు.

అల్పాహారం పంపిణీ

పాల్వంచ: 187మంది మున్సిపాలిటీ కార్మికులకు రేగళ్ల గ్రామానికి చెందిన ఆకిరెడ్డి శ్రీనివాసరావు తన తల్లి రాజమ్మ జ్ఞాపకార్థం మంగళవారం అల్పాహారం, వాటర్ బాటిళ్లను మున్సిపల్ కమిషనర్ కె.సుజాత చేతుల మీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా యానంబైల్ గ్రామానికి చెందిన బుడగం నాగేశ్వరరావు అరటి పళ్లు అందించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, కనగాల అనంతరాములు, నల్లెల వాసు, పారిపత్తి వెంకటేశ్వర్లు, కోళ్ల మోహన్‌రావు, బొశెట్టి సాంబయ్య, నాగేంద్ర, తాజుద్దీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదలకే అందాలి..

కొత్తగూడెంఅర్బన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, సమస్యలపై కమిషనర్ శేషాంజన్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. అధికారులు ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందేలా చూడాలని కోరారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం..

పాల్వంచ: విద్యుత్ రంగంపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడిని ఖండించి కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం అల్లూరి సెంటర్ వద్ద నిరసన తెలిపారు. మాట్లాడుతూ... ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రైవేటీకరణ యత్నాలు మొదలయ్యాయని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా సంఘీభావం ప్రకటించాలన్నారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, పి.తులసీరామ్, ఎస్‌కె.నిరంజన్, కాంతి, మాధవి, గౌస్య, మొగిలి, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా కళాశాలలో 18 సంవత్సరాలు పైబడిన విద్యార్థినులకు జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఇన్ఫోసిస్ ప్రీ ప్రగతి కోహార్ట్-4పై 2025పై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినుల్లో స్వీయ వృద్ధి, వృత్తిపరమైన పురోగతి, కెరీర్ అభివృద్ధితోపాటు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఉంటుదని తెలిపారు. అందరూ హాజరవ్వాలని కోరారు.

21పిట్ ఏరియా అభివృద్ధికి సహకరించండి..

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియా అభివృద్ధికి సహకరించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా మేనేజర్ ఈసం కృష్ణయ్యను అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సమస్యలను వివరించారు. జేకే ఓసీలో కొంతమంది నిర్వాసితులు అవుతున్నారని, వారితోపాటు దశాబ్దకాలంగా 21పిట్ ఏరియాలోనే నివాసం ఉంటున్న ప్రజలను ఆదుకునేందుకు సింగరేణి సహకరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన క్వార్టర్లకు మరమ్మత్తులు చేయించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పూనెం సురేందర్, వడ్ల శ్రీను, అబ్దుల్ నబీ, మంచాల వెంకటేశ్వర్లు, ఎట్టి హరికృష్ణ, తాండ్ర నాగరాజు, క్లింట్‌రోచ్, గూళ్ల మొగిలి పాల్గొన్నారు.